క్లుప్తంగా

ప్రణాళికతో ఉపాధి పనులు


మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక: ఉపాధి హామీ పథకం పనులను పక్కా ప్రణాళికతో సక్రమంగా జరిగేలా చూడాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. మునగపాకలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం సామాజిక తనిఖీకి సంబంధించి ప్రజా ప్రతినిధులు, అధికారులతో జరిగిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులకు అవకాశం ఉంటుందన్నారు. పనుల్లో ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం ఏపీవో శివ, ఏవో ప్రసాద్, మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్, పలువురు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: రీ–సర్వేలో లోపాలను సవరించేందుకు రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు అన్నారు. మండలంలోని మల్లవరంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి ఇటువంటి కార్యక్రమం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇందల హేమలత, రీ–సర్వే డీటీ పడాల్, రైతులు ఇందల నాయుడు, నూకప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పార్లర్ ప్రారంభం


పార్లర్‌ను ప్రారంభిస్తున్న ప్రసాద్

మునగపాక: వినియోగదారులకు నాణ్యమైన పాల ఉత్పత్తులను అందించాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక మెయిన్‌రోడ్డులో విశాఖ డెయిరీకి అనుబంధంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ పార్లర్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెయిరీ ఉత్పత్తులు అందరికీ అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్లర్ నిర్వాహకుడు మళ్ల కృష్ణ, పెద్దలు రామ్మోహనరావు, దాసరి అప్పారావు, ఆడారి కృష్ణ, కాండ్రేగుల జగన్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుటేరులో చేప పిల్లల్ని పట్టొద్దు


మత్స్యకారులను విచారిస్తున్న డీఎఫ్‌వో ప్రసాద్

పాయకరావుపేట: ఉప్పుటేరులో పెరిగే చేప పిల్లల్ని ఎవ్వరూ పట్టొద్దని, వాటిని ఎదిగే వరకు ఉంచాలని మత్స్యశాఖ జిల్లా అధికారి(డీఎఫ్‌వో) ప్రసాద్ సూచించారు. పెంటకోట గ్రామంలో పలువురు మత్స్యకారులు(పల్లీలు) చేసిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆయన విచారణ చేపట్టారు. తాండవ నది నీరు సముద్రంలో కలిసే చోట, ఉప్పుటేరులో పెరుగుతున్న చేప పిల్లలను ఒడిశాకు చెందిన కొందరు పట్టుకుపోతున్నారని స్థానిక పల్లీలు జిల్లా అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇరువర్గాలతో సమావేశమై డీఎఫ్‌వో ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. చేపలు ఎదిగిన తర్వాత స్థానికంగా ఉన్న పల్లీలు పట్టుకోవచ్చునని చెప్పారు. ఈ విచారణలో ఫిషరీస్ ఏడీ జాస్మిన్, సచివాలయ ఫిషరీస్ అసిస్టెంట్ శేఖర్ పాల్గొన్నారు.


నేడు నీటి సరఫరా బంద్

యలమంచిలి రూరల్: తాగునీటి పథకం పైపులైన్‌కు మరమ్మతు పనుల కారణంగా శనివారం పట్టణంలో పలు ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోనుంది. సోముదేవపల్లి నుంచి పట్టణానికి వేసిన పైపులైను పాతది కావడంతో తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. దీంతో పట్టణానికి తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. శుక్రవారం కూడా పలు ప్రాంతాలకు నీటి సరఫరా జరగలేదు. శనివారం కూడా నీటి సరఫరాకు అంతరాయం ఉండటంతో మహిళలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక ట్యాంకర్లతో నీరు అందిస్తామని మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు మీడియాకు తెలిపారు.

అందాల తీరం.. పర్యాటకుల స్వర్గధామం

- పర్యాటకులను ఆకట్టుకుంటున్న రేవుపోలవరం తీరం
- కార్తికమాసం కావడంతో సందడిగా మినీ కైలాసగిరి


రేవుపోలవరం తీరం(ఇన్‌సెట్) కొండపై పార్వతీపరమేశ్వరుల విగ్రహాలు


దార్లపూడి వద్ద పోలవరం ఎడమ కాలువ అక్విడెక్ట్ పైనుంచి జలధార సోయగం

ఎస్.రాయవరం: పెద్దగా ఆటుపోట్లు లేని సముద్ర తీరంగా పేరొందిన రేవుపోలవరం తీరం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. సముద్ర మట్టానికి 26 మీటర్ల ఎత్తులో ఉన్న ఇక్కడి బీచ్ కార్తిక మాసంలో జిల్లా వాసులకు మంచి పిక్నిక్ స్పాట్‌గా నిలిచింది. తీరం సమీపంలోని మినీ కై లాసగిరిపై నుంచి సముద్ర అందాలను వీక్షించే అవకాశం ఉంది. ప్రభుత్వం ఇప్పటికే ఈ ప్రాంతంలో రూ.1.50 కోట్ల నిధులతో తీరానికి పర్యాటక హంగులు దిద్దారు. మినీ కై లాసగిరిపైకి గ్రావెల్ రోడ్డు, పర్యాటకులు సేద తీరేందుకు బెంచీలు, జమ్ము గడ్డి కాటేజీలు ఏర్పాటు చేశారు.

కొండపై విశాఖ కైలాసగిరి మాదిరిగా..

కొండపై ఏర్పాటు చేసిన శివపార్వతుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇవి విశాఖ కైలాసగిరిపై కొలువుదీరిన ఆదిదంపతుల ఉత్సవమూర్తులను గుర్తుకుతెస్తాయి. అలల కొండను ఢీకొనడంతో ఏర్పడిన వివిధ ఆకృతులు, ఎంతో చరిత్ర కలిగిన లక్ష్మీమాధవస్వామి గుడి, తీరంలో నిర్మించిన జెట్టీ పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. తీరాన్ని ఆనుకుని కొబ్బరి తోటలు ఎక్కువగా ఉన్నాయి. విహారయాత్రకు వచ్చేవారిలో ఎక్కువగా తీరం వద్దనే వంటలు చేసుకుని, సహపంక్తి భోజనాలు చేస్తారు. కార్తిక మాసం మొదలుకొని నెల రోజుల పాటు పర్యాటకుల రాకతో ఈ ప్రాంతం సందడిగా ఉంటుంది. బంగారమ్మపాలెంలో శారదా, వరహానది కలయిక ప్రాంతాన్ని కూడా ఎక్కువగా సందర్శిస్తుంటారు. అదే క్రమంలో వేమగిరి పర్వతంపై లక్ష్మీ రంగనాయకులను దర్శించుకునేందుకు పైకి వెళ్లి విశాలమైన వరి పైరు, పచ్చని కొబ్బరి తోటలు వీక్షించి ఆనందించవచ్చు. అలాగే దార్లపూడి లక్ష్మీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో, పోలవరం ఎడమ కాలువ నిర్మాణంలో సుమారు కిలోమీటరు మేర అక్విడెక్ట్ ప్రదేశం కనువిందు చేస్తున్నాయి. ఇలా మండలంలో అనేక సుందరమైన ప్రదేశాలు పిక్నిక్ స్పాట్‌లుగా పేరొందాయి.


తీరాన్ని ఆనుకుని ఉన్న లక్ష్మీమాధవస్వామి ఆలయం

ఆహ్లాదకర తీరం..

రేవుపోలవరం తీరం ఆహ్లాదకరంగా ఉంటుంది. పిక్నిక్‌లకు చాలా అనుకూలం. మినీ కైలాసగిరి, సాయంత్రం ఇసుక తిన్నెల్లో క్రీడలు మంచి అనుభూతినిస్తాయి. ప్రభుత్వం మరిన్ని సదుపాయాలు కల్పిస్తే బాగుంటుంది. తాగునీటి సదుపాయం కల్పించాలి. పిల్లలకు ఆట పరికరాలు ఏర్పాటు చేయాలి.

– చోడిపల్లి అప్పన్న, విద్యా కమిటీ మాజీ చైర్మన్, రేవుపోలవరం

పర్యాటక ప్రాంతాల అభివృద్ధి అవసరం



మండలంలో పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయాలి. ఏడాదికేడాదికి పర్యాటకుల రద్దీ పెరుగుతోంది. అనకాపల్లి జిల్లాలో సుందరమైన తీరం రేవుపోలవరం. కార్తీక మాసం నెలరోజులు సందడి వాతావరణం ఉంటుంది. పోలీస్ బందోబస్తు కూడా పెంచాలి.

– సీహెచ్.అప్పన్న, వైస్ ఎంపీపీ, ఎస్.రాయవరం

పిక్నిక్ స్పాట్లలో ప్రత్యేక బందోబస్తు



పర్యాటక ప్రాంతాల్లో పిక్నిక్‌ల నిర్వహణ కోసం ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. తీరంలో ప్రమాదాలు జరగకుండా మెరైన్ సిబ్బందితో పాటు ఎస్.రాయవరం పోలీసులను అందుబాటులో ఉంచుతున్నాం. అడ్డురోడ్డు, దార్లపూడి ప్రదేశాల్లో కూడా బీట్ నిర్వహిస్తున్నాం. ఆకతాయిలపై నిఘా పెడతాం.

– వి.భీషణరావు, ఎస్‌ఐ, ఎస్.రాయవరం

కౌలు రైతులకూ రుణాల మంజూరు


కార్యక్రమంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ

కోటవురట్ల: కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ కె.సత్యనారాయణ అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించి రుణాల మంజూరుపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు చేసే కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయకపోవడం వల్ల ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయించడంతో అప్పుల పాలయ్యారని, ఇటువంటి ధోరణి మంచిది కాదన్నారు. కౌలు రైతులకు కూడా సకాలంలో రుణాలు మంజూరు చేసి వారిని ఆదుకోవాలని సూచించారు. డ్వాక్రా రుణాలు ఏపీఎం, సీసీ ప్రమేయం లేకుండా ఇవ్వొద్దని, పలు ప్రాంతాలలో రుణాలు దుర్వినియోగం అవుతున్నాయని పేర్కొన్నారు. తన పరిధిలో నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట, కోటవురట్ల, నాతవరం, మాకవరపాలెం మండలాలకు సంబంధించి 24 బ్యాంకులు ఉన్నట్టు తెలిపారు. ఈ బ్యాంకుల పరిధిలో అర్హులకు పారదర్శకంగా రుణాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. అర్హులైన వారికి ముద్ర రుణాలు అందించి ఆర్థిక భరోసా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, డీఆర్‌డీఏ అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

మునగపాక: సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు కోరారు. మునగపాక పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆడారి మంజు, పార్టీ నేతలు దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, డొక్కా నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారు పాసు పుస్తకాల కోసం నిరసన


నిరసన తెలుపుతున్న రాజవరం రైతులు

పాయకరావుపేట: రాజవరం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 146లో ఉన్న రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ పలువురు రైతులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రెవెన్యూ సదస్సులో భాగంగా రాజవరం గ్రామంలో శుక్రవారం మండల తహసీల్దార్ శ్రీనివాసరావు దృష్టికి రైతులు తమ సమస్యలను తీసుకెళ్లారు. రికార్డులను పరిశీలించి, సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

‘ఉల్లాస్’తో అక్షరాస్యత పెంపు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

ఎస్.రాయవరం: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని ఉల్లాస్ కార్యక్రమం అమలు చేస్తున్నట్టు ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. మండల మహిళా కార్యాలయంలో శుక్రవారం గ్రామైక్య సంఘాల సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సభ్యుల్లో చదువుకున్న వారిని గుర్తించి విద్యా వలంటీర్లుగా నియమిస్తామన్నారు. వారితో చదువురాని సభ్యులకు అక్షరాలు నేర్పించి విద్యావంతులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉల్లాస్ పథకం లక్ష్యం, ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, జీవన్ నైపుణ్యాలు, ప్రాథమిక విద్య, నిరంతర విద్య, మొబైల్‌లో లావాదేవీలు వంటి అంశాలను వలంటీర్లకు బోధించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శివప్రసాద్, సీసీలు, 55 మంది విద్యా వలంటీర్లు పాల్గొన్నారు.

ముగిసిన చదరంగం ఉచిత శిక్షణ


చదరంగం శిక్షణలో భాగంగా విద్యార్థులకు మెలకువలు వివరిస్తున్న కోచ్ శ్రవంత్

యలమంచిలి రూరల్: స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత చదరంగం శిక్షణ శుక్రవారం రాత్రి ముగిసింది. ఈ నెల 6న ప్రారంభమైన ఈ శిక్షణలో చదరంగంలో మెలకువలపై ప్రొఫెషనల్ కోచ్ సీహెచ్ శ్రవంత్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో త్వరలో జరగనున్న అంతర కళాశాలల మెన్, ఉమెన్ చదరంగం చాంపియన్ షిప్ పోటీల్లో తమ కళాశాల తరపున పాల్గొననున్న విద్యార్థులకు ఈ సందర్భంగా తర్ఫీదునిచ్చినట్టు కళాశాల పీడీ పోలిరెడ్డి తెలిపారు.

ఘనంగా అయ్యప్ప అంబలం పూజ


తిమ్మరాజుపేటలో అయ్యప్ప అంబలంపూజ

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో శుక్రవారం రాత్రి అయ్యప్పస్వామి అంబలం పూజ ఘనంగా జరిగింది. అయ్యప్ప నామస్మరణతో తిమ్మరాజుపేట మార్మోగింది. ఈ సందర్భంగా ఆలపించిన గీతాలు అలరించాయి. అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అంబలం పూజకు పెద్ద ఎత్తున స్వాములు తరలివచ్చారు.

ఉపాధి అక్రమాలపై విచారణ

యలమంచిలి రూరల్: మండలంలోని పులపర్తి గ్రామంలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తప్పుడు మస్టర్లతో వేతనాలను స్వాహా చేసిన వీఆర్పీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామానికి చెందిన కొందరు ఇటీవల జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై శుక్రవారం యలమంచిలి ఎంపీడీవో కొండలరావు పులపర్తి గ్రామ సచివాలయంలో ఫిర్యాదుదారుల సమక్షంలో విచారణ జరిపారు. పలు అంశాలపై ఆరోపణలు ఎదుర్కొంటున్న మేట్ ఏనుగుల ఆదిలక్ష్మిని వివరణ అడిగి నమోదు చేసుకున్నారు. ఈ సదర్భంగా ఆదిలక్ష్మికి మద్దతుగా పలువురు మహిళలు సచివాలయం వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో ఫిర్యాదుదారులు కూడా ఎక్కువ సంఖ్యలో అక్కడకు చేరుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. చివరకు విచారణ ముగిసిన తర్వాత ఫిర్యాదుదారులు దీనిపై తాము సంతృప్తి చెందటం లేదని సంతకాలు చేయకుండా వెళ్లిపోయారు. గ్రామ పెద్దలు సుంకర కొండబాబు, సుంకర బుల్లిబాబు, కె.హెచ్.జి.దేవర హాజరయ్యారు.

భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీదే


మాట్లాడుతున్న డాక్టర్ మాధవరావు

పాయకరావుపేట: భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీదేనని, దీనిపై ప్రతి విద్యార్థికి అవగాహన అవసరమని కె.ఎల్.యూనివర్సిటీ రీజనల్ మేనేజర్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ చందూరు మాధవరావు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీపై శ్రీప్రకాష్ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే సదస్సులో శుక్రవారం ఆయన మాట్లాడారు. కంప్యూటర్ కోర్సు చదివే విద్యార్థులకు భవిష్యత్తులో ఏఐ ఆధారిత పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. మెరుగైన విశ్లేషణాత్మక, సమస్య పరిష్కార నైపుణ్యాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అవకాశాలు పెంపొందించుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారీగా ఇసుక నిల్వలు స్వాధీనం


గుర్తించిన ఇసుక నిల్వల వద్ద తహసీల్దారు తిరుమలబాబు

కోటవురట్ల: అక్రమ ఇసుక తవ్వకాలపై రెవెన్యూ అధికారులు స్పందించారు. అక్రమ ఇసుక తవ్వకాలపై తహసీల్దారు తిరుమలబాబుకు శుక్రవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తహసీల్దారు తిరుమలబాబు శుక్రవారం రాత్రి పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి గొట్టివాడ పరిధిలోని మూడు ప్రాంతాలలో వరుస దాడులు నిర్వహించారు. ఆయా ప్రాంతాలలో భారీగా ఉన్న ఇసుక నిల్వలను చూసి రెవెన్యూ సిబ్బంది ఆశ్చర్యపోయారు. మూడు ప్రాంతాలలో అక్రమంగా నిల్వ చేసి లారీలలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దారు మాట్లాడుతూ ఇసుక నిల్వలు సుమారు 70 ట్రాక్టర్లు ఉంటాయని తెలిపారు. ఉచిత ఇసుక పాలసీని అడ్డంపెట్టుకుని అక్రమ ఇసుక తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విజయసాయిని కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు


సాయిరెడ్డిని కలిసి అభినందిస్తున్న సమన్వయకర్త కంబాల జోగులు

నక్కపల్లి: వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్‌గా నియమితులై విశాఖ వచ్చిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య నేతలు శుక్రవారం కలిశారు. మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త కంబాల జోగులు, మరో మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భార్గవ్, ఎంపీటీసీ తిరుపతిరావు, గొర్ల గోవిందు పాల్గొన్నారు.



సాయిరెడ్డిని కలిసిన కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం, మాజీ ఎమ్మెల్యే చెంగల, తదితరులు

సీపీఎం ప్రజాపోరు ప్రారంభం


తిమ్మరాజుపేటలో ప్రజాపోరు నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం: మండలంలోని తిమ్మరాజుపేటలో సీపీఎం ప్రజా పోరు కార్యక్రమం శుక్రవారం ప్రారంభించింది. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వల్ల కలుగుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సీపీఎం సీనియర్ నాయకుడు కర్రి అప్పారావు, మండల కన్వీనర్ ఆర్.రాములు మాట్లాడుతూ రాష్ట్రంలో చాలా సమస్యలు ప్రజల్ని ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్థానికులకు కంపెనీల్లో ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, మహిళలు, దళితులపై జరుగుతున్న అరాచకాలను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.సోమునాయుడు, ఎస్.రామునాయుడు, నడుపూరి సన్యాసిరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

11న చలో ఆర్డీవో కార్యాలయం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ, తదితరులు

మునగపాక: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ కోరారు. మండలంలోని ఉమ్మలాడలో శుక్రవారం భవన నిర్మాణ కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ నెల 11న నిర్వహించనున్న చలో ఆర్డీవో కార్యాలయం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం లక్ష్మణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద నిఘా పటిష్టం చేయాలన్నారు. సిమెంట్, ఇనుము ధరలను తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గాదేవి తాపీపని వార్ల సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, నాయకులు రాము, రామప్పారావు, మొల్లేటి వాసు, సూరిశెట్టి సైదునాయుడు, మద్దాల సీతారామ్, భాను, తదితరులు పాల్గొన్నారు.

లారీ నుంచి జారిపడిన రాళ్లు

- పూడిమడక రోడ్డులో తప్పిన ప్రమాదం


పూడిమడక రోడ్డులో జారిపడిన రాళ్లు

మునగపాక: పూడిమడక రోడ్డులో మునగపాక వద్ద శుక్రవారం ఉదయం ప్రమాదం తప్పింది. రాయి లోడుతో వెళ్తున్న లారీ నుంచి రెండు రాళ్లు జారిపడ్డాయి. రాంబిల్లి మండలంలోని నేవీ పనుల్లో భాగంగా నిత్యం వందలాది లారీలపై రాళ్లు తరలిస్తుంటారు. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం బండరాళ్ల లోడుతో వెళ్తున్న లారీ నుంచి రెండు రాళ్లు జారిపడ్డాయి. అయితే ఆ సమయంలో ఇతర వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగించకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలంటూ పదేపదే ఫిర్యాదులు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలు జరగక ముందే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించండి


అరట్లకోటలో సంపద కేంద్రంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో జయప్రకాష్‌రావు

పాయకరావుపేట: గ్రామాలు అభివృద్ధిపై సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీడీవో జయప్రకాష్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలో అరట్లకోట, గోపాలపట్నం గ్రామ సచివాలయాలను ఆయన సందర్శించారు. గ్రామంలో పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. చెత్త నుంచి సంపద కేంద్రాల్లో వానపాములను విడిచి పెట్టారు. వర్మీకంపోస్టు తయారీపై సిబ్బంది దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శి వైవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

వేతనాల కోసం 104 సిబ్బంది వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న 104 సిబ్బంది

యలమంచిలి రూరల్: మూడు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నామని, వెంటనే వేతనాలు ఇప్పించాలని కోరుతూ శుక్రవారం 104 సిబ్బంది తహసీల్దార్ కె వరహాలుకు వినతి పత్రం అందజేశారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్లు, ఇతర సిబ్బందికి జీవో 7 ద్వారా వేతనాలు చెల్లింపు జరిగేలా చూడాలని కోరారు. ఇంకా సిబ్బంది ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంయూ సిబ్బంది రవిబాబు, రాజాబాబు, మణికంఠ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: దార్లపూడి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కేవీ చిన గుమ్ములూరు వాటర్ వర్క్స్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏటికొప్పాక గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. శనివారం ఉదయం 4 నుంచి 11 గంటల వరకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సరఫరా ఇస్తామన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.